సాక్షి
జోగులాంబ గద్వాల
శుక్రవారం ၊ 19 ၊ ఏప్రిల్ ၊ 2024



పునరావాసంపై సర్వే

నల్లమల నుంచి వెళ్లే వారికి పునరావాసం కోసం అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు.

వివరాలు 8లో ▸



రిజిస్ట్రేషన్ తప్పనిసరి

సొంతంగా వైద్యం అందించాలనుకుంటే అనుమతి పొందాలని వైద్య సంచాలకుడు అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
44.3/23.4

వాతావరణం

ఉదయం ఉంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు బలంగా వీస్తాయి. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి



మానవపాడు: వేసవి ఎండల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని, వడదెబ్బ భారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ జిల్లా వైద్యాధికారి శశికళ అన్నారు. గురువారం మండలకేంద్రంలో వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు అత్యవసరమైతేనే మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం వరకు బయటకు రావొద్దని, పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని, సరిపడా నీరు తాగాలని, బయటికి వెళ్తే గొడుగు తీసుకెళ్లాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ కాన్పులు జరగాలని, వేసవికాలం సందర్భంగా బుధవారం, శనివారం ఉదయం 8గంటలలోపు వ్యాక్సిన్ అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సత్యనారాయణ, చంద్రన్న, ఫార్మాసిస్ట్ తిరుమల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రూల్స్ అమలుకు చర్యలు చేపట్టాలి



గద్వాల న్యూటౌన్: రాష్ట్రంలో రెండు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న సర్వీస్ రూల్స్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టాలని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వీస్ రూల్స్ అమలుకు నోచుకోకపోవడం వల్ల విద్యాశాఖలో ఎంఈఓ, డైట్ లెక్చరర్స్, డీఈఓ పోస్టులు 95 శాతం ఖాళీగా ఉన్నాయని చెప్పారు. దీనివల్ల పర్యవేక్షణ కొరవడి విద్యాభివృద్ధికి ఆటంకం కలుగుతోందని అన్నారు. పంచాయతీరాజ్ ఉపాధ్యాయులు, లోకల్‌క్యాడర్ ఆర్గనైజేషన్ 2018 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ద్వార జరగడం వల్ల సర్వీస్‌రూల్స్ రూపొందించడం సులభమని, దీని ఏర్పాటుకు కృషి చేయాలని కేంద్రప్రభుత్వ అధికారి మాణిక్ రాజ్‌కన్నన్ తమ సంఘం పక్షాన కోరామని తెలిపారు. మల్టీజోన్-2లో జీహెచ్ఎం, ఎస్ఏ విభాగాల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి స్నేహ పూర్వక వాతావరణాన్ని కల్పించడం శుభసూచకమన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేయాలని, పదవీ విరమణ బెనిఫిట్స్‌ను నగదు రూపంలో ఇవ్వాలన్నారు.సంఘం జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి, ప్రధానకార్యదర్శి వేణుగోపాల్, గౌరవ అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, ఏబేలు, శివశంకర్‌రెడ్డి, ప్రబాకర్, సలాంఖాన్ పాల్గొన్నారు.

వేరుశనగ @ 6,526

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు గురువారం 863 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.6526, కనిష్టం రూ.2699, సరాసరి రూ.5069 ధరలు పలికాయి. అలాగే, 52 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్టం రూ.5529, కనిష్టం రూ.3016, సరాసరి రూ.5301 ధరలు వచ్చాయి. 18 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం రూ.9706, కనిష్టం రూ.8069, సరాసరి రూ. 9666 ధరలు పలికాయి.

నామినేషన్ల జాతర..

- లోక్‌సభ ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల
- 2 పార్లమెంట్ స్థానాల్లో తొలిరోజు 4 దాఖలు
- మహబూబ్‌నగర్‌లో బీజేపీ నుంచి డీకే అరుణ, మరో స్వతంత్ర అభ్యర్థి..
- నాగర్‌కర్నూల్‌లో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు భరత్‌ప్రసాద్, మల్లు రవి..
- 25 వరకు నామినేషన్ల స్వీకరణ.. 26న స్క్రూటినీ.. మే 13న పోలింగ్





నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్, కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి తదితరులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: లోక్‌సభ ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఉమ్మడి పాలమూరులోని రెండు పార్లమెంట్ స్థానాల్లో (మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్) తొలిరోజు మొత్తం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. మహబూబ్‌నగర్‌లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ రెండు సెట్లు, మరో స్వతంత్ర అభ్యర్థి మహ్మద్ ఇంతియాజ్ అహ్మద్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి రవినాయక్‌కు సమర్పించారు. నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి, బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ పత్రాలను కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్‌కు అందజేశారు. ఈ నెల 25 వరకు నామినేషన్ పత్రాల స్వీకరణకు తుది గడువు కాగా.. 26న స్క్రూటినీ నిర్వహించనున్నారు. 29న ఉపసంహరణ అనంతరం బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. వచ్చే నెల 13న పోలింగ్ జరగనుండగా.. జూన్ 4న కౌంటింగ్ చేపట్టి అదే రోజున ఫలితాలు వెల్లడించనున్నారు.

మహబూబ్‌నగర్ కాషాయమయం..

మహబూబ్‌నగర్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ నామినేషన్ సందర్భంగా పట్టణం అంతా కాషాయమయంగా మారింది. నామినేషన్ వేసేందుకు ఇంటి నుంచి బయలు దేరే క్రమంలో ముందుగా ఆమె గోమాతకు పాదపూజ చేశారు. కాటన్ మిల్లు వద్ద వెంకటేశ్వర ఆలయంలో స్వామి పాదాల వద్ద నామినేషన్ పత్రాలు ఉంచి పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు కళాకారుల ఆటపాటల మధ్య రాజ్యసభ ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, ఎమ్మెల్సీ రవీందర్‌రెడ్డితో కలిసి బైక్ ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఆ తర్వాత అన్నపూర్ణ గార్డెన్స్ నుంచి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా క్లాక్‌టవర్ వరకు ర్యాలీ సాగింది.

నాగర్‌కర్నూల్‌లో సందడి లేకుండానే..

నాగర్‌కర్నూల్‌లో తొలిరోజు అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ అభ్యర్థులు మల్లు రవి, భరత్ ప్రసాద్ ఎలాంటి సందడి లేకుండానే నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. వీరు ఆయా పార్టీల ముఖ్య నేతల సమక్షంలో మరో సెట్ దాఖలు చేయనున్నారు. అదే రోజున పార్టీ శ్రేణులతో కలిసి భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించడంతోపాటు కార్నర్ మీటింగ్‌లు, బహిరంగసభల ద్వారా ఎన్నికల ప్రచారం ముమ్మరం చేయనున్నారు.

23, 24, 25వ తేదీల్లో..

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో ఈ నెల 23న కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి మరోసెట్ నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యే అవకాశం ఉన్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ 24న నామినేషన్ దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఆ పార్టీ కీలక నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నామినేషన్ ర్యాలీలో పాల్గొననున్నారు. అదేవిధంగా బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ 25న మరో సెట్ దాఖలు చేయనుండగా.. ఈ కార్యక్రమానికి ఆ పార్టీకి చెందిన ముఖ్యనేత, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ హాజరుకానున్నారు.

నేడు చల్లా వంశీకి మద్దతుగా సీఎం రాక..

మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి శుక్రవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించనుండగా.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. క్లాక్‌టవర్ చౌరస్తాలో నిర్వహించనున్న కార్నర్ మీటింగ్‌లో ఆయన పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడనున్నారు. ఈ మేరకు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు భారీ ఎత్తున శ్రేణులు తరలించేలా ఆయా నియోజకవర్గాల నేతలు ఏర్పాట్లు చేశారు.



మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి డీకే అరుణ తదితరులు

మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలో ఏడు **అసెంబ్లీ నియోజక**వర్గాలు ఉన్నాయి. మొత్తం **16,80,417** మంది ఓటర్లు ఉండగా.. ఇం**దులో మహిళలు** 8,48,293, పురుష ఓటర్లు **8,32,080, ఇత**రులు 44 మంది ఉన్నారు. ఈ **మేరకు 1,937** పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు **చేశారు. అదేవిధం**గా నాగర్‌కర్నూల్ పార్లమెం**ట్ పరిధిలో** సైతం ఏడు అసెంబ్లీ నియోజకవ**ర్గాలు ఉన్నాయి**. మొత్తం 17,34,773 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో మహిళలు 8,70,694, పురుష ఓటర్లు 8,64,034, ఇతరులు 45 మంది ఉన్నారు. ఈ మేరకు 2,057 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

2 స్థానాల్లోనూ త్రిముఖమే..

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌ల పరిధిలో త్రిముఖ పోరు కొనసాగనుంది. మహబూబ్‌నగర్ (జనరల్)లో బీజేపీ నుంచి డీకే అరుణ, కాంగ్రెస్ నుంచి చల్లా వంశీచంద్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి బరిలో ఉన్నారు. నాగర్‌కర్నూల్ (ఎస్సీ రిజర్వ్‌డ్)లో బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ పోతుగంటి రాములు కుమారుడు భరత్ ప్రసాద్, కాంగ్రెస్ నుంచి మల్లు రవి, బీఆర్ఎస్ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బరిలో ఉన్నారు. ఈ పార్లమెంట్ పరిధిలోని అలంపూర్‌కు చెందిన మాజీ ఎంపీ, సీనియర్ నేత మందా జగన్నాథం కాంగ్రెస్‌ను వీడి బీఎస్పీలో చేరగా.. ఆయన బరిలో నిల్చొన్న పక్షంలో ఈ స్థానంలో చతుర్ముఖ పోటీ కొనసాగే అవకాశం ఉంది.

నేడు బీఆర్ఎస్ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్..

బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫాం అందుకున్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసేందుకు అన్నీ సిద్ధం చేసుకున్నారు. త్వరలో మంచి ముహూర్తం చూసుకుని పార్టీ ముఖ్యనేతల సమక్షంలో మరో సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేసేలా ముందుకు సాగుతున్నారు. అదే రోజున భారీ ర్యాలీతో పాటు కార్నర్ మీటింగ్‌కు సమాయత్తమవుతున్నారు.

ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా

- రానున్న రెండు నెలల్లో ఇబ్బందులు కలగకుండా చర్యలు
- అన్ని నీటి వనరులను వినియోగించుకోవాలి
- కలెక్టర్ బీఎం సంతోష్



అలంపూర్‌లో తాగునీటి సమస్య నెలకొన్న వార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

అలంపూర్: మున్సిపాలిటీలోని ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం అలంపూర్‌లోని 1, 7, 9 వార్డుల్లో కలెక్టర్, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ భీమేశ్వర్ రావు, మున్సిపల్ కమిషనర్ సరస్వతి, ఇంజనీర్ మేఘనాథ్‌గౌడ్ పర్యటించి నీటి సమస్య గురించి ఆరా తీశారు. అలాగే, తుంగభద్ర నదిలో పరిశీలించారు. అనంతరం మున్సిపల్ అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తాగునీటి సరఫరా చేయాలని, రాబోయే రెండు నెలలు తాగునీటి సరఫరా కీలకంగా ఉంటుందని, ఇందుకోసం రూ.5 లక్షలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, చేతి పంపులు, బోరు మోటార్లు, పైపు లైన్‌ల లీకేజీల మరమ్మతు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. పైప్‌లైన్‌ల లీకేజీల కారణంగా నీరు కలుషితమయ్యే అవకాశం ఉండటంతో తక్షణమే మరమ్మతు చేపట్టాలన్నారు. తుంగభద్ర నదిలో నిలువ ఉన్న నీటిని పంపింగ్ చేసి గృహ అవసరాలకు వినియోగించుకోవడానికి చర్యలు చేపట్టాలన్నారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ..

మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల, మన ఊరు మనబడి పథకం కింద ఎంపికైన ఈ పాఠశాలల్లో చేపట్టాల్సిన తాత్కాలిక మరమ్మతులు, తాగునీరు, ఫ్లోరింగ్, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లతో పాటు డిజిటల్ క్లాస్ రూమ్‌లను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోగా పూర్తి చేయాలని సూచించారు. వీరితోపాటు ఎంపీడీఓ అబ్దుల్ జబ్బార్, ఎంఈఓ అశోక్ కుమార్, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సమన్వయంతో పనిచేయాలి..

గద్వాల రూరల్: వేసవిలో జిల్లాలో ఎక్కడా కూడా తాగునీటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. మిషన్‌భగీరథ అధికారులు, జిల్లా పరిషత్, పంచాయతీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గట్టు, అయిజ, మానోపాడు, ఇటిక్యాల మండలాల్లోని గ్రామపంచాయతీల వారీగా గత సమీక్షలో చర్చించి చేపట్టిన అవసరమైన పనులకు సంబంధించి వివరాలు అడిగితెలుసుకున్నారు. గ్రామాలలో ప్రజల అవసరాలకు ఎన్ని లీటర్ల నీరు అవసరం ఎంత సరఫరా చేస్తున్నాం అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే సహించేదిలేదన్నారు. అదేవిధంగా అవసరమైన ప్రతిచోట చేతిపంపులు, బోరుమోటర్లు, పైపులైన్‌ల మరమ్మత్తులు చేపట్టి సక్రమంగా తాగునీటి సరఫరా చేయాలన్నారు. వచ్చే రెండునెలల పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈసమావేశంలో మిషన్‌భగీరథ ఎస్ఈ జగన్‌మోహన్‌రెడ్డి, ఈఈలు శ్రీధర్‌రెడ్డి, భీమేశ్వర్‌రావు, డీఆర్‌డీవో నర్సింగ్‌రావు, ఇంచార్జ్ డీపీవో వెంకట్‌రెడ్డి, ఆయా మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

వనపర్తి కాంగ్రెస్‌లో వర్గపోరు

- ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చెరోదారి అన్నట్లుగా మారిన వైనం
- చేరికల విషయంలో రెండుగా చీలిక నాయకులు
- ఎమ్మెల్యే ఇంటి ఎదుట పార్టీ గోపాల్‌పేట మండల అధ్యక్షుడి ఆత్మహత్యాయత్నం
- ముదిరిన విభేదాలు

వనపర్తి: జిల్లా కాంగ్రెస్‌లో వర్గపోరు రోజురోజుకు ముదురుతోంది. కొత్త, పాత నేతలంటూ రెండు గ్రూపులయ్యాయి. ఆధిపత్యం కోసం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఎవరికి వారు సొంత క్యాడర్‌ను తయారు చేసుకునే ప్రయత్నం.. ఇతర పార్టీల నుంచి చేరికలను ప్రోత్సహిస్తుండటం విభేదాలకు దారితీస్తోంది. ఈ విషయంపై రెండు వర్గాల నాయకులు విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. మరికొందరు వ్యక్తిగతంగా తీసుకుని గుడి ఎక్కుదాం.. దేవుళ్లపై ప్రమాణం చేద్దామంటూ సామాజిక మాధ్యమాల వేదికగా విమర్శలు గుప్పించారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన కొన్నాళ్లకే పార్టీ రెండుగా చీలడం.. సొంత పార్టీ నాయకులే విమర్శలు చేసుకోవడం ప్రతిపక్ష పార్టీలు, ప్రజల దృష్టిలో పార్టీని చులకన చేశాయి. ఇటీవల పెబ్బేరు మండలం రంగాపూర్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి సమక్షంలో కొందరు బీఆర్ఎస్ నాయకులు పార్టీలో చేరేందుకు సిద్ధమైతే.. ఎమ్మెల్యే వర్గీయులు అడ్డుకుని చిన్నారెడ్డి వేసిన పార్టీ కండువాలను లాగేశారు. వారు చేసిన అఘాయిత్యాలు మీకు తెలియవు.. అధికారం ఎక్కడుంటే అక్కడికి వచ్చే వారిని ప్రోత్సహించొద్దని చెప్పడంతో చిన్నారెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారు. తాజాగా అదే తరహాలో గోపాల్‌పేట మండలం తాడిపర్తికి చెందిన ఇద్దరు బీఆర్ఎస్ నాయకులను పార్టీలో చేర్చుకునేందుకు ఎమ్మెల్యే అనుచరులు చర్చలు చేసినట్లు సమాచారం తెలుసుకుని అదే గ్రామానికి చెందిన పార్టీ మండల అధ్యక్షుడు గణేష్‌గౌడ్ వారిని పార్టీలో చేర్చుకోవద్దని.. పదేళ్లుగా తమపై అధికార జులూం చూపి కేసులు పెట్టి వేధించారని చెప్పేందుకు గురువారం స్థానిక తిరుమల హిల్స్‌లోని ఎమ్మెల్యే ఇంటికి అనుచరులతో కలిసి వచ్చారు. ఎమ్మెల్యేతో మాట్లాడుతూనే.. పక్కనే ఉన్న అదే మండలానికి చెందిన సత్యశీలారెడ్డి తమను దూషించాడనే కోపంతో గణేష్ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించాలని అగ్గిపెట్టె తీసి ఎమ్మెల్యే చేతికి ఇవ్వబోయారు. దీంతో ఒక్కసారిగా అప్రమత్తమైన గన్‌మెన్లు అక్కడి నుంచి దూరంగా తీసుకెళ్లి పోలీసులకు అప్పగించారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే వర్గీయులు గణేష్‌గౌడ్‌తో పాటు ఆయన అనుచరులను పంపించాలంటూ ఘర్షణకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను శాంతింపజేసి గణేష్‌గౌడ్‌ను అక్కడి నుంచి పంపించారు.

సమస్య ఇలా మొదలైంది..

గతేడాది డిసెంబర్ 3న అసెంబ్లీ ఎన్నికల విజయోత్సవ ర్యాలీలో జిల్లాకేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రసంగిస్తూ.. నవంబర్ 30 వరకు కాంగ్రెస్‌పార్టీలో ఉన్నవారే కొనసాగుతారని, నాయకులు సిఫారస్ చేస్తే తప్పా.. ఇతర పార్టీల వారిని చేర్చుకోనని బహిరంగంగా ప్రకటించారు. టికెట్ ఆశించి భంగపడిన డా. జి.చిన్నారెడ్డికి కొద్దిరోజుల్లోనే ప్రభుత్వం కేబినెట్ హోదా కలిగిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడి పదవి కట్టబెట్టింది. దీంతో పదవి పొందిన ఆయన ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురు నాయకులను పార్టీలో చేర్చుకోవడం ప్రారంభించారు. దీన్ని గమనించిన ఎమ్మెల్యే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు కొద్దిరోజుల ముందు చేరికలకు గేట్లు ఎత్తినట్లు సంకేతాలు ఇవ్వడంతో ప్రతిపక్ష కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచులు, పలువురు నాయకులు ఆయన సమక్షంలో పార్టీలో చేరడం మొదలెట్టారు. వర్గాన్ని పెంచుకునే ప్రయత్నంలో అప్పట్లో అధికారం ఉందని అడ్డగోలు కేసులు పెట్టించిన వారిని పార్టీలో చేర్చుకోవడం.. ఏళ్లుగా పార్టీనే నమ్ముకుని ఉన్న వారు వాటిని వ్యతిరేకించడంతో ఘర్షణలు, ఆత్మహత్యయత్నంలాంటి ఘటనలకు కారణమవుతున్నాయి.

పథకం ప్రకారమే..

పథకం ప్రకారమే వాళ్లు పెట్రోల్ తీసుకొని వచ్చారని ఎమ్మెల్యే మేఘారెడ్డి తెలిపారు. ఒంటిపై పెట్రోల్ చల్లుకునే క్రమంలో తనపై కూడా పడిందని.. తనకు కూడా ప్రమాదం జరిగేది కదా అని పేర్కొన్నారు.

కష్టపడి పనిచేసే వారిని పట్టించుకోవడం లేదు..



ఒంటిపై పెట్రోల్ పోసుకున్న కాంగ్రెస్‌పార్టీ గోపాల్‌పేట మండలం అధ్యక్షుడు గణేష్‌గౌడ్

బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కేసులు, ఇబ్బందులకు గురైన వారి మాట వినకపోవడంతోనే తాను ఒంటిపై పెట్రోల్ పోసుకున్నానని పార్టీ గోపాల్‌పేట మండల అధ్యక్షుడు గణేష్‌గౌడ్ అన్నారు. గురువారం గోపాల్‌పేట మండలం తాడిపర్తిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పదేళ్ల పాటు ఇబ్బందులకు గురిచేశారని.. పార్టీలో చేర్చుకోవద్దని ఎమ్మెల్యేను కోరానని, అంతలోనే పక్కనున్న వారు తీవ్ర ఇబ్బందికర పదజాలంతో మాట్లాడటంతో మనస్తాపానికి గురై పెట్రోల్ పోసుకుని ఎమ్మెల్యేకు అగ్గిపెట్టె ఇచ్చానని చెప్పారు. భవిష్యత్‌లో కూడా వారిని పార్టీలో చేర్చుకుంటే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు కృషి చేయాల్సిన సమయంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరం అన్నా రు. పార్టీలో గణేష్‌గౌడ్ కూడా కుటుంబ సభ్యుడేనని.. ఆయన ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారో అందరికీ తెలిసిందేనని తెలిపారు. ఇబ్బందులకు గురిచేసిన వ్యక్తులు పార్టీలో చేరినా భవిష్యత్‌లో ప్రమాదమేనన్నారు. జరిగిన విషయంపై ఎమ్మెల్యే పునరాలోచించాలని, స్థానిక నాయకుల అభిప్రాయాలు తీసుకుని పార్టీలో చేర్చుకోవాలని కోరారు.

విజయమే అంతిమ లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న బీఎస్పీ ఎంపీ అభ్యర్థి మందా జగన్నాథం

ఎర్రవల్లిచౌరస్తా: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే అంతిమ లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని మాజీ ఎంపీ, బీఎస్పీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మందా జగన్నాథం అన్నారు. బీఎస్పీలో చేరిన సందర్భంగా గురువారం ఎర్రవల్లి మండలంలోని కొండేరులో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలంతా ఏకదీక్షతో బాబా సాహెబ్ అంబేద్కర్, కాన్షీరామ్ ఆశయాలకు అనుగుణంగా సమసమాజ నిర్మాణం కోసం పనిచేయాలన్నారు. అన్ని రంగాల్లో కూడా బహుజనులు పైకి రావడానికి అంబేద్కర్ చేపట్టిన రాజ్యాధికారం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు ప్రజల దగ్గరికి వెళ్లి బీఎస్పీ ఉద్దేశాలను వివరించాలన్నారు. రేపటి నుండే కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి ఎంపీ ఎన్నికల ప్రచారం నిర్వహించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ గెలిచే విధంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి ఎం.జి కృష్ణ, జిల్లా అధ్యక్షుడు రాంబాబు, నాయకులు రాజు, సునంద, యేసురాజు, సవరన్న, వెంకట్, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

బీజేపీ గెలుపును ఎవరూ అడ్డుకోలేరు



మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి

గద్వాల రూరల్: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా బీజేపీ పార్టీ గెలుపును ఆపలేరని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో ఆ పార్టీ గద్వాల, అలంపూర్, వనపర్తి నియోజకవర్గాల బూత్ ఏజెంట్లు, ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న వారు బీజేపీ పార్టీ గెలుపు కోసం చేయాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో 12స్థానాలలో బీజేపీ పార్టీ గెలవబోతుందని అందులో నాగర్‌కర్నూల్ ఎంపీ స్థానం ఉందని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే గెలుపు ఖాయమన్నారు. భరత్‌ప్రసాద్‌కు చిన్నవయసులోనే పార్టీ ఎంపీగా టికెట్ ఇవ్వడం జరిగిందని, 2లక్షల మెజారీటి తగ్గకుండా గెలిపించాలన్నారు. పదేళ్లకాలంలో కేంద్రప్రభుత్వం చేపట్టిన వివిధ రకాల సంక్షేమాభివృద్ధి పథకాలు ఇంటింటికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అబయ్‌పాటిల్, బంగారు శృతి, రాంచంద్రారెడ్డి, డీకే స్నిగ్ధారెడ్డి, అప్పర్‌పాష, అశోక్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జక్కా రఘునందన్‌రెడ్డి, రామాంజనేయులు, పద్మావతి, కృష్ణవేణి, జయశ్రీ, పాండు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, గ్రామస్తులు

గట్టు: బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా సంక్షేమ శాఖ అధికారి సుధారాణి అన్నారు. గురువారం మండలంలోని బల్గెరలో మహిళా శిశు సంక్షేమ శాఖ వారి జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల సంరక్షణ చట్టాలు, బాల్య వివాహలు, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. బాల్య వివాహం చేస్తునట్లు తెలిస్తే గ్రామంలో ఉండే బాలల పరిరక్షణ కమీటీకి లేదా 100 లేదా 1098 సమాచారం అందించాలని సూచించారు. బాలల లైంగిక వేధింపుల చట్టం 2012 గురించి ఆమె వివరాలు తెలియజేశారు. సీడీపీఓ కమలాదేవీ మాట్లాడుతూ సామాజిక మాద్యమాల వల్ల పిల్లలు చెడు అలవాట్లకు లోనయ్యే అవకాశం ఉందని, తల్లిదండ్రులు కేవలం మంచి విషయాల కోసం మాత్రమే పిల్లలు ఫోన్లు ఉపయోగించేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళా రక్షణ చట్టాలు, 181, 1098 టోల్‌ఫ్రీ నంబర్లపై ఆమె అవగాహన కల్పించారు. అనంతరం బేటీ బచావో-బేటీ పఢావో పై ప్రతిజ్ఞ చేయించారు. డీసీపీఓ నర్సింహులు, జోష్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

వారం రోజుల్లో పెళ్లి.. అంతలోనే విషాదం

- ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

గద్వాల క్రైం: ఈ నెల 24న పెళ్లి చేసుకోవాల్సిన ఓ యువకుడు గురువారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గద్వాల మండలం శెట్టి ఆత్మకూర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు, బంధువుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నవీన్ (24) మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ నెల 24న గద్వాల మండలానికి చెందిన ఓ యువతితో వివాహం నిశ్చయమైంది. బంధువులు, స్నేహితులకు సైతం ఆహ్వాన పత్రికలు పంపిణీ చేశాడు. పెళ్లి పనుల నిమిత్తం బుధవారం హైదరాబాద్‌కు వెళ్లి రాత్రి తిరిగి స్వగ్రామంలోని చిన్నాన్న ఇంటికి వచ్చి అక్కడే భోజనం చేసి నిద్రించాడు. తెల్లవారుజామున సమీప పొలంలోకి బహిర్భూమికి వెళ్లి అక్కడే చెట్టుకు ఉరేసుకున్నాడు. ఉదయం అటుగా వెళ్లిన గ్రామస్తులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పెళ్లి చేసుకోవాల్సిన యువకుడు బలవన్మరణానికి పాల్పడటంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి అంజిలన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పర్వతాలు వివరించారు.

ఆటో, బొలెరో ఢీ: ఒకరు మృతి


నర్సయ్య(ఫైల్)

పెద్దకొత్తపల్లి: పెద్దకార్పాముల గ్రామ శివారులో ఆటో, బులెరో ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆటో డ్రైవర్ గువ్వలి నర్సయ్య (34) ఆటో తీసుకొని పెద్దకార్పాముల వెళ్తున్నాడు. ఇదే క్రమంలో వెనకనుంచి బులెరోతో డ్రైవర్ వినోద్ వేగంగా వెళ్తూ ఆటోను ఢీకొట్టాడు. దీంతో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నర్సయ్యకు భార్య రాధ, కూతురు ఉన్నారు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో అర్చకుడు మృతి


బద్రీనాథ్ (ఫైల్)

బిజినేపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెం పీహెచ్‌సీ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ అర్చకుడు మృతిచెందినట్లు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మహబూబ్‌నగర్‌లోని వీరన్నపేటకు చెందిన అర్చకుడు బద్రీనాథ్ (24) ద్విచక్ర వాహనంపై బిజినేపల్లి నుంచి నాగర్‌కర్నూల్ వైపు వెళ్తున్నాడు. గుడ్లనర్వకు చెందిన శ్రీశైలం బైక్‌పై నాగర్‌కర్నూల్ బయలుదేరారు. పాలెం పీహెచ్‌సీ దాటిన తర్వాత బద్రీనాథ్ బైక్ ముందు వెళ్తున్న శ్రీశైలం బైక్‌ను అదుపుతప్పి ఢీకొట్టడంతో బద్రీనాథ్ కిందపడి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన మరో బైక్ కూడా బద్రీనాథ్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనపై శ్రీశైలంతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

వడదెబ్బతో వృద్ధురాలు..

ధరూరు: వడదెబ్బకు గురై వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన కావలి వెంకటమ్మ(62) పొట్టకూటి కోసం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పండ్లు అమ్ముకుంటూ జీవనం కొనసాగించేదని రేవులపల్లి పోలీసులు తెలిపారు. రెండు రోజులుగా వడదెబ్బకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. బుధవారం సాయంత్రం మృతి చెందగా, చెల్లెలు తెలుగు జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ హుస్సేన్ తెలిపారు. ఈమె భర్త చనిపోగా, పిల్లలు ఎవరూ లేరని గ్రామస్తులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

దేవరకద్ర: మండల కేంద్రంలో వృద్ధుడు(65) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగన్న వివరాల ప్రకారం.. కొన్ని రోజులుగా దేవరకద్రలో భిక్షాటన చేసుకుంటూ వృద్ధుడు జీవిస్తున్నాడు. గురువారం ఉదయం బస్టాండ్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తలకు గాయం, నోట్లో నుంచి రక్తం రావడం, ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు గాయపరిచి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బావిలో పడి మహిళ..

పాన్‌గల్: ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి చెందిన ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కేతేపల్లికి చెందిన నాసోల్ల చంద్రమ్మ(58) కట్టెల కోసం వెళ్లి.. తీటకుంట సమీపంలో ఉన్న బావిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. మృతురాలికి భర్త ఎల్లయ్య, ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. ఘటనపై ఎస్‌ఐ వేణును వివరణ కోరగా బావిలో నుంచి మృతదేహాన్ని తీసి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. కుటుంబసభ్యులు ఇచ్చే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

పాలమూరును దగా చేసిన కేసీఆర్

- బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్


మేనిఫెస్టో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్, బీజేపీ అభ్యర్థి డీకే అరుణ తదితరులు

పాలమూరు: పాలమూరులో ఇంకా వలసలు, వలస కార్మికులు ఉండిపోవడానికి గతంలో పనిచేసిన కేసీఆర్ దత్తత పేరుతో దగా చేశారని బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. కేసీఆర్ రాష్ట్రం కోసం కాకుండా కేటీఆర్, కవిత కోసం పనిచేశారన్నారు. బీఆర్‌ఎస్ చచ్చిన పాముతో సమానమని ఈ ఎన్నికల్లో ఆ పార్టీ ప్రస్తావన ఏం ఉండదన్నారు. మీ ఓటు వృథా కాకుండా బీజేపీకి వేస్తే మూడోసారి మోదీ ప్రధాని కావడం.. డీకే అరుణ పాలమూరు అభివృద్ధికి నిధులు తెస్తుందన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా డీకే అరుణ గురువారం ఉదయం కలెక్టరేట్‌లో లక్ష్మణ్‌తో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. అంతకు ముందు జిల్లాకేంద్రంలోని పద్మావతికాలనీలో ఉన్న ఆమె ఇంట్లో గోమాతకు పూజలు నిర్వహించి బయలుదేరారు. కాటన్ మిల్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి.. నామినేషన్ పత్రాలు స్వామివారి పాదాల దగ్గర ఉంచి పూజలు చేశారు. ఆ తర్వాత జిల్లా యువ మోర్చా ఆధ్వర్యంలో ద్విచక్రవాహన ర్యాలీతో కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అనంతరం డీకే అరుణతోపాటు లక్ష్మణ్, రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, నాగురావు నామాజీతో కలిసి కలెక్టర్ రవినాయక్‌కు నామినేషన్ పత్రాలు అందించారు. ఆ తర్వాత అన్నపూర్ణ గార్డెన్ నుంచి క్లాక్‌టవర్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. బంజార కళాకారులు, గిరిజనుల సంప్రదాయ నృత్యాలు, ఒగ్గు కళాకారుల ఆటపాటలు, పంజాబీ బ్యాండ్ మేళాల విన్యాసాలు, మహిళ నృత్యాలు ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డీకే అరుణ నామినేషన్ ర్యాలీకి అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఆ తర్వాత క్లాక్‌టవర్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ మాట్లాడారు. మహబూబ్‌నగర్‌లో ఉన్న బీసీలు ఆలోచించాలని కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ బీసీ వ్యతిరేక పార్టీగానే మిగిలిపోతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కులం, మతం పేరుతో రాజకీయాలు చేస్తోందన్నారు. కొత్తగా రేవంత్‌రెడ్డి ముదిరాజ్‌ల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని, దీనిని బీసీలు ఏమాత్రం నమ్మరాదన్నారు. అంతకు ముందు డీకే అరుణ మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు అమలు చేయని వాళ్లు కూడా ఇక్కడ వచ్చి కోతలు కోస్తున్నారని, కాంగ్రెస్ పార్టీకి ఓటమి భయం పట్టుకుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసాలు, పిచ్చి కూతలు, వ్యక్తిగత దూషణలకు ప్రజలు సమాధానం చెబుతారన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలనలో పాలమూరు ప్రజలు విసిగిపోయారని, ఇక్కడి నుంచి గతంలో గెలిచిన అభ్యర్థులు పాలమూరుకు చేసింది ఏమిలేదన్నారు. డీకే అరుణను ఓడించడానికి మీరు అందరూ కలిసి ఎందుకు కుట్ర పన్నుతున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, రతంగ్‌పాండురెడ్డి, రాములు పాల్గొన్నారు.

ప్రత్యేక మేనిఫెస్టో ఆవిష్కరణ

వికసిత్ మహబూబ్‌నగర్ లక్ష్యంగా బీజేపీ అరుణ హామీ..మోదీ గ్యారంటీ పేరుతో మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ప్రత్యేక మేనిఫెస్టోను విడుదల చేశారు.మహబూబ్‌నగర్‌ను స్మార్ట్ సిటీ రూపుదిద్దడం, మున్సిపాలిటీలను ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేయడం, స్కిల్ సెంటర్లు ఏర్పాటు, రోడ్లు, రైల్వే లైన్లు విస్తరణ చేయడం.. తదితర ముఖ్యమైన హామీలున్నాయి.

ప్రచార పర్వం

'రాష్ట్రాన్ని అప్పుల పాలుచేశారు'


మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

గండేడ్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలుచేసిందని.. పుట్టబోయే పిల్లల మీద కూడా అప్పులు మోపారని వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వెన్నాచేడ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల ప్రభుత్వం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట ఇస్తే మడమ తిప్పడని.. ఇచ్చిన హామీలు కచ్చితంగా నెరవేరుస్తారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్వాకం వల్లే రాష్ట్రం దివాళ తీసిందన్నారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ రూ.7 లక్షల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ నేను మీ వాడిని ఈ ఎన్నికలు నావి కావు మీవి మీరే నన్ను గెలిపించాలన్నారు. గతంలో కులాలు, రాజకీయాలకు అతీతంగా నిస్వార్థంగా సేవ చేశానన్నారు. ఏ సేవ చేయని వారికి రిటైర్‌మెంట్ ఇవ్వాలని ఎద్దేవా చేశారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నాపై సవాల్ విసిరారని దానిని స్వీకరిస్తున్నానని, నాపై చేసే ఆరోపణలు రుజువు చేస్తే ముక్కు నేలకు రాస్తానన్నారు. ఆయన ఇంటి పేరు కొండ అయితే నా ఇంటి పేరు కష్టార్జితం అన్నారు. ఐదేళ్లు మీ కోసం కష్టపడతానని పేర్కొన్నారు. పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాములు, సభ్యులు రుతిక్‌రెడ్డి, నర్సింహారావు, జితేందర్‌రెడ్డి, పుల్లారెడ్డి, చిన్నయ్య, ఆశన్న, మక్బూద్, టీక్యా, ఆశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గురువారం తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నుంచి పార్టీ బీఫాంలు అందుకుంటున్న మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థులు మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, చిత్రంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, జైపాల్‌యాదవ్, గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డి

మోదీ పథకాలే మరోసారి గెలిపిస్తాయి

- బీజేపీ పార్లమెంటరీ బూత్‌స్థాయి సమావేశంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి


మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి

నాగర్‌కర్నూల్: దేశంలో ప్రధాని నరేంద్రమోదీ అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలే మరోసారి బీజేపీని గెలిపిస్తాయని బీజేపీ శాసనసభ పక్ష నేత, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పార్లమెంట్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచ దేశాల్లో భారత్‌కు పేరు ప్రతిష్టలు తీసుకురావడంలో ప్రధాని మోదీ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా పూర్తిగా విఫలమైందన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలహీన పడిందని, ఈసారి కందనూలు గడ్డ మీద బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. మోదీ మూడోసారి అధికారంలోకి వస్తేనే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఎంపీ రాములు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో మోదీ హవా నడుస్తుందని, దేశం మరింత అభివృద్ధి చెందాలంటే మరోమారు మోదీ ప్రధాని కావాలన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి భరత్‌ను పెద్ద మెజారిటీతో గెలిపించి మోదీకి బహుమతిగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, బీజేపీ పార్లమెంట్ ఎన్నికల చీఫ్ ఎలక్షన్ ఏజెంట్ జక్కా రఘునందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాషాయజెండా రెపరెపలాడుతుంది

మొదటిసారి నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో కాషాయ జెండా రెపరెపలాడబోతుందని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ నామినేషన్ కార్యక్రమానికి ఆయన హాజరై అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 400 సీట్లు గెలిచి నరేంద్రమోదీ ప్రధానమంత్రి కాబోతున్నారని, అందులో నాగర్‌కర్నూల్ కూడా ఒకటన్నారు. విశ్వగురుగా భారతదేశం ఉండటానికి ప్రయత్నిస్తున్న నరేంద్రమోదీ అనుచరుడిగా భరత్ ప్రసాద్ నిలబడ్డారని, అందుకే ఆయనను పెద్ద మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో విజయఢంకా మోగిస్తామన్న నమ్మకం తమకు ఉందన్నారు.

'అబద్ధాలతోనే పదేళ్లు కాలయాపన'

- నామినేషన్ కార్యక్రమంలో గిరిజనులు పాల్గొనాలి
- టీపీసీసీ ఆదివాసీ విభాగం చైర్మన్ బెల్లయ్య నాయక్


మాట్లాడుతున్న రాష్ట్ర చైర్మన్ బెల్లయ్య నాయక్

స్టేషన్ మహబూబ్‌నగర్: పదేళ్లుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ అబద్ధాలతో ప్రజలను మోసం చేశారని టీపీసీసీ ఆదివాసీ విభాగం చైర్మన్ బెల్లయ్యనాయక్ దుయ్యబట్టారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల పాటు అధికారంలో ఉన్న మోదీ గిరిజనులు, ఆదివాసీలకు ఉపయోగపడే ఒక చట్టం కూడా చేయలేదని వాపోయారు. నరేంద్రమోదీ గిరిజన వ్యతిరేకి అని ఆరోపించారు. పదేళ్ల పాలనలో తాను చేపట్టిన పథకాల గురించి వివరించి ఓట్లు అడిగితే అభ్యంతరం లేదు కానీ, రామాలయం పేరు మీద ఓట్లు వేయమని అడగడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గత ప్రధానులతో పోల్చుకుంటే మోదీ అసమర్థుడు అని ఎద్దేవాచేశారు.

150 సీట్లు కష్టమే..

ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో 400 ఎంపీ సీట్లు గెలుస్తామని బీజేపీ ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటుందని, 150కి మించి గెలవలేని పరిస్థితి ఉందన్నారు. 300కు పైగా సీట్లతో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించనుందని జోస్యం చెప్పారు. శుక్రవారం మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ పరిధిలోని గిరిజనులు, ఆదివాసీలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ లింగంనాయక్, రాష్ట్ర కన్వీనర్లు గోపాల్‌నాయక్, గంగ్యానాయక్, జిల్లా కోఆర్డినేటర్ రాంచందర్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు రవినాయక్, మండల అధ్యక్షుడు తులసీరాం నాయక్, నాయకులు శంకర్‌నాయక్, శ్రీనునాయక్, హరినాయక్ పాల్గొన్నారు.

వైద్యసేవలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి


సమీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర సంచాలకుడు డా. రవీంద్రనాయక్

- రాష్ట్ర వైద్య సంచాలకుడు డాక్టర్ రవీంద్రనాయక్

పాలమూరు: ఎంబీబీఎస్, బీడీఎస్, బీహెచ్‌ఎంఎస్, బీయూఎంఎస్, డీఎంఎల్‌టీ, ఫిజియోథెరపీ చదివిన వారందరూ సొంతంగా వైద్యసేవలు అందించాలనుకుంటే తప్పనిసరిగా జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీతో అనుమతి పొందాలని రాష్ట్ర వైద్య సంచాలకుడు డా. రవీంద్రనాయక్ సూచించారు. గురువారం జిల్లాకేంద్రంలోని వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొని క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌పై చర్చించారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న వాటికి జరిమానాలు వేయడం, పద్ధతి మార్చుకోకపోతే రిజిస్ట్రేషన్ రద్దు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత పెరిగిందని.. జిల్లాలో 42 డిగ్రీలు మించి ఉండటంతో వడదెబ్బ ప్రమాదం పొంచి ఉందని, క్షేత్రస్థాయిలో ఆశలు, ఏఎన్‌ఎంలను అప్రమత్తం చేయాలని, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. జిల్లాలో కుష్టు సర్వే పకడ్బందీగా పూర్తి చేయాలని, కొత్త కేసులకు సరైన చికిత్స అందించాలన్నారు. డ్రైడే.. ఫ్రైడే పాటిస్తూ ప్రతి ఇంటిని ఆశాలు, ఆరోగ్య సిబ్బంది నెలలో రెండుసార్లు సందర్శించాలని సూచించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ డా. కృష్ణ జిల్లాలో ఆరోగ్యశాఖ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. తల్లుల ఆరోగ్య పోషణ విషయంలో రాష్ట్రస్థాయిలో జిల్లా 9 ర్యాంకులో ఉందని తెలిపారు. సమీక్ష సమావేశంలో ఆరోగ్యశాఖ అధికారులు శశికాంత్, శ్రీధర్‌రెడ్డి, భాస్కర్ నాయక్, కిరణ్మయి, శంకర్, రఫీక్, తిరుపతిరావు, మెడికల్ ఆఫీసర్లు, ప్రోగ్రామ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

అడ్డాకుల: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీందర్‌నాయక్ అన్నారు. మూసాపేట మండలం జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. వైద్య సేవలందించడానికి ఆస్పత్రిలో ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు అందుతున్న వైద్యం గురించి ఆరా తీశారు. చికిత్స కోసం వచ్చి డాక్టర్ గది ముందు వేచి ఉన్న రోగులతో ఆయన మాట్లాడారు. ఆస్పత్రిలో పని చేసే సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందిస్తే ప్రజలకు చిరకాలం గుర్తుండిపోతామని సిబ్బందికి సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండి మంచి వైద్య చికిత్సలు చేయాలని ఆదేశించారు. ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారని స్థానిక వైద్య సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, ప్రోగాం ఆఫీసర్ భాస్కర్ నాయక్, మెడికల్ ఆఫీసర్ షభానాబేగం, పీహెచ్‌ఎన్‌ఓ శకుంతల, సీహెచ్‌ఓ జైపాల్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


శేఖర్ (ఫైల్)

పెబ్బేరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన ఘటన పెబ్బేరు–కొత్తకోట బైపాస్‌పై గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి కథనం మేరకు.. పెబ్బేరు మండలం రంగాపురం గ్రామానికి చెందిన బూరమోని శేఖర్ (38) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. గురువారం ఉదయం అత్తగారి ఊరైన వై.శాఖాపూర్‌కు వెళ్లి సాయంత్రం తిరిగి గ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యంలో పెబ్బేరు–కొత్తకోట బైపాస్ సమీపంలో సీతారామయ్య పెట్రోల్‌పంపు దగ్గర బైక్‌ను వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. శేఖర్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. తండ్రి రామచంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

అకస్మాత్తుగా కారులో మంటలు



ఖిల్లాఘనపురం/భూత్పూర్: భూత్పూర్ మండలంలోని మద్దిగట్ల గ్రామ శివారులో అకస్మాత్తుగా కారులో మంటలు చెలరేగి కారు దగ్ధమైన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు వివరాల ప్రకారం వనపర్తి జిల్లా ఖిల్లా ఘణపురంలో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కిషోర్ తోటి ఉద్యోగితో కలిసి కారులో మహబూబ్‌నగర్ వెళ్తున్నారు. మద్దిగట్ల శివారులోకి రాగానే అకస్మాత్తుగా కారు ఇంజన్ నుంచి మంటలు వచ్చాయి. దీంతో వారు అప్రమత్తమై భయాందోళనతో కారు నుంచి బయటకు దిగారు. ఒక్కసారి మంటలు చెలరేగి కారు పూర్తిగా దగ్ధం అయ్యింది. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని ఎస్‌ఐ తెలిపారు.

రూ.51వేల నగదు పట్టివేత

బాలానగర్: మండల కేంద్రంలోని పోలీస్ చెక్‌పోస్టులో గురువారం నగదును పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై తిరుపాజి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా, హైదరాబాద్ నుంచి అనంతపురం జిల్లాకు సేవాలాల్ నాయక్ కారులో రూ.51వేల నగదుతో వెళ్తుండగా వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పునరావాసంపై అధికారుల సర్వే


వటువర్లపల్లి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న అధికారులు

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో నివాసం ఉంటున్న వారు ఎన్‌టీసీఏ పథకంలో భాగంగా ఈ ప్రాంతం నుంచి స్వచ్ఛందంగా తరలివెళ్లే వారికి పునరావాసం కల్పించేందుకు అధికారులు గ్రామంలో సర్వే నిర్వహిస్తున్నారు. అభయారణ్యంలో మానవ మనుగడకు ఇబ్బంది ఉన్నందున అటవీ శాఖ కల్పించే రూ.15 లక్షల ప్యాకేజీలో భాగంగా అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి గ్రామస్తులు పునరావాసం కోరుతున్నారు. గ్రామం నుంచి ఇది వరకే 585 మంది అటవీశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా కుటుంబాలకు సంబంధించిన ఇళ్లు, వ్యవసాయ పొలాలు, ఆస్తులు తదితర వాటి విలువను నమోదు చేస్తున్నారు. మొదటి రోజు సుమారు 30 కుటుంబాలకు సంబంధించిన ఆస్తుల వివరాలు సేకరించినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ లక్ష్మీపతి తెలిపారు. నాలుగు రోజుల క్రితం ఇదే గ్రామంలో ఇంటింటికి తిరిగి సామాజిక బాధ్యతగా అధికారిక సర్వే (సోషల్ ఎకనామి ఆడిట్) చేసినట్లు తెలిపారు. త్వరలో గ్రామస్తులను పునరావాసం కల్పించే మైదాన ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడి పరిసరాలు, ప్రదేశాలను చూపించనున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. అటవీశాఖ అధికారులు ముత్యాలు, శిల్ప, బాలకృష్ణ, బాలస్వామి, జానకిరామ్, మక్బూద్, శ్యామ్‌సుందర్, జగదీష్, జగన్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

అడ్డాకుల: మూసాపేట మండలంలోని నిజాలాపూర్ గ్రామంలో గురువారం సాయంత్రం ఓ పిచ్చి కుక్క స్వైరవిహారం చేయడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డుపై ఆడుకుంటున్న చిన్నారులు మానస, అభినందన్‌పై, వారికి కొంత దూరంలో ఉన్న మరో వ్యక్తి భానుప్రకాశ్ గాయపర్చడంతో కలకలం రేగింది. అటుగా వెళ్తున్న మేస్త్రీ నాగన్న చిన్నారులను కాపాడేందుకు కుక్కను బెదిరించాడు. ఇంతలో కుక్క చిన్నారులను వదిలి నాగన్నపై దాడి చేసింది. నాగన్న చేతిని నోటితో గట్టిగా పట్టుకుని వదలకపోవడంతో స్థానికులు వచ్చి విడిపించారు. తర్వాత పిచ్చి కుక్కను స్థానికులు చంపేశారు. కుక్క దాడిలో గాయపడిన నలుగురు బాధితులను కారులో జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన తర్వాత మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు.

వడ్లను ఆరబెడుతుండగా పిడుగుపడి యువ రైతు మృతి


నీలకంఠం (ఫైల్)

కోయిల్‌కొండ: మండలంలోని నల్లవల్లిలో పిడుగుపాటుకు రైతు మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు నీలకంఠం (32) ఇంటికి సమీపంలోని పొలంలో వడ్లను ఆరబెడుతుండగా అకస్మాత్తుగా చిరుజల్లులతో పిడుగుపడడంతో కిందపడి స్పృహ కోల్పోయాడు. చుట్టు పక్కలవారు ఆయనను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

మానసిక స్థితి సరిగా లేని మహిళపై ఉపాధ్యాయుడి లైంగిక దాడి

బిజినేపల్లి: మానసిక స్థితి సరిగా లేని ఒక మహిళపై అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు గురువారం లైంగిక దాడికి పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. బిజినేపల్లిలో మాసయ్య అనే వ్యక్తి ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. స్థానికంగానే నివాసం ఉంటున్న ఆయన ఇంటికి కాస్త దూరంలో ఓ మహిళ ఇల్లు ఉంది. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉపాధ్యాయుడు ఇంట్లోకి ప్రవేశించి, ఆమెకు మాయమాటలు చెప్పి అసభ్యంగా ప్రవర్తించాడు. అప్పుడే కుటుంబ సభ్యులు ఇంటికి రాగా ఉపాధ్యాయుడు చేసిన దుశ్చర్యను చూసి ఆగ్రహంతో దేహశుద్ధి చేసి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగశేఖరరెడ్డి తెలిపారు.